నిఘా నేత్రాలతో పర్యవేక్షణ

● గిరిప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సీసీ కెమెరా


పోర్టు స్టేడియం తూర్పు గేటు వద్ద ఏర్పాటు చేసిన నిఘా కెమెరా

సీతమ్మధార: ఈ నెల 2న సింహాచలం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని భక్తులు నడిచే మార్గంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మల ఆధ్వర్యంలో వీధిలైట్లు, సీసీ కెమెరాలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, ట్రాఫిక్ సమస్యలు లేకుండా పటిష్టంగా చర్యలు చేపట్టారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం తూర్పు గేటు తోపాటు ఇతర ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఎటువంటి భద్రతా లోపం లేకుండా చూస్తున్నారు. పోలీస్ కమిషనరేట్‌లోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌లో నిఘా నేత్రాల ద్వారా భక్తుల గిరిప్రదక్షిణను పర్యవేక్షించేలా అన్ని ఏర్పాట్లు చేశారు. సీతమ్మధార నుంచి ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు గిరిప్రదక్షిణ మార్గంలో ఇప్పటికే కొత్తగా రోడ్లు నిర్మించారు. నడక మార్గాన్ని ఇరువైపులా శుభ్రం చేశారు. గతేడాది కంటే లక్షల్లో భక్తులు సింహగిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ద్వారా ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా.. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సింహగిరి ప్రదక్షిణ ప్రశాంతంగా జరిగేలా పోలీస్, జీవీఎంసీ, ఇతర శాఖల అధికారులు చర్యలు చేపడుతున్నారు.

క్షేత్రస్థాయిలో పటిష్టంగా డ్రైడే


ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ సత్యానంద్

సీతంపేట: వర్షా కాలం ప్రారంభం కావడంతో మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో డ్రైడే కార్యక్రమం పటిష్టంగా అమలయ్యేలా చూడాలని మలేరియా సూపర్ వైజర్ సత్యానంద్ అన్నారు. ఎన్జీజీవోస్ కాలనీ విద్యుత్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశా కార్యకర్తలకు ఫ్రైడే-డ్రైడే నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉన్నట్టయితే దోమలు త్వరగా వృద్ధి చెంది జ్వరాలను వ్యాప్తి చేసే అవకాశముందన్నారు. ప్రతి శుక్రవారం ఇంటింటికీ వెళ్లేటప్పుడు నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, పూల కుండీలు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్స్, మనీ ప్లాంట్లను కచ్చితంగా తనిఖీ చేయాలని సూచించారు. వారానికి ఒకసారి పాత్రలను శుభ్రం చేసి మళ్లీ నీరు పట్టుకోమని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి బంగారు హారం బహూకరణ


ఈవో శిరీషకు నక్లెస్ అందజేస్తున్న దాత చిల్లా వెంకటలక్ష్మి

అల్లిపురం: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి సీతమ్మధార టీపీటీ కాలనీకి చెందిన చిల్లా సత్యనారాయణరెడ్డి 61వ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు చిల్లా వెంకటలక్ష్మి 77 గ్రాముల 310 మిల్లీ గ్రాముల బంగారు హారాన్ని దేవస్థానం ఈవో కె.శిరీషకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గురుద్వార్ దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద వామపక్షాలు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలపై దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు లక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, విమల, పి.మణి, బి.వెంకటరావు, ఎం.సుబ్బారావు, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


కాన్వెంట్ జంక్షన్ సర్వీస్ రోడ్డులో మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాన్వెంట్ జంక్షన్ సర్వీస్ రోడ్డులో సుమారు 35 ఏళ్ల వయసు గల ఓ గుర్తు తెలియని మగ మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. సదరు మృతుడు ఫిట్స్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అతడి పేరు, చిరునామా వివరాలు తెలియలేదు. ఇతడి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఎవరికైనా మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డులకు దరఖాస్తులు

మహారాణిపేట: నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్, వాటర్(సముద్రం) కేటగిరీల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. జీవిత కాల సాధన సాహస కృత్య కేటగిరీల్లో గత మూడేళ్ల కాలంలో అద్భుతమైన పనితీరు కనబరిచి విజయం సాధించిన వ్యక్తులు అర్హులన్నారు. వివరాలు, దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి https://awards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అప్‌లోడ్ చేసిన పత్రాలు, నామినేషన్ సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తును ఈనెల 4వ తేదీలోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేటలో పని వేళల్లో సమర్పించాలని ఆయన కోరారు.

పర్యావరణ హితంగా గిరిప్రదక్షిణ


సత్యం జంక్షన్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

● సీఎంహెచ్‌వో నరేష్‌కుమార్ పిలుపు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు

సీతమ్మధార: గిరిప్రదక్షిణను విజయవంతం చేద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్‌కుమార్ పిలుపునిచ్చారు. హైవేపై సత్యం జంక్షన్ వద్ద శుక్రవారం జీవీఎంసీ, గ్రీన్ వలంటీర్స్, సిఫా, గ్రీన్ క్లైమేట్ టీమ్, గ్రీన్ అంబాసిడర్స్ టెక్ మహీంద్రా స్మార్ట్ అకాడమీ, టెక్ మహీంద్రా ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ గిరిప్రదక్షిణలో పాల్గొనే భక్తులంతా జిల్లా అధికారుల ఆదేశాలను అనుసరించి.. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దన్నారు. ఆహార పదార్థాలు, ప్రసాదాలను నేలపై, రహదారి మీద పడేయవద్దని కోరారు. విశాఖ ఎన్‌జీవో ఫోరం అధ్యక్షురాలు డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ విద్యా సంస్థల్లోని అధిక సంఖ్యలో విద్యార్థులకు గిరిప్రదక్షిణను పర్యావరణ హితంగా నిర్వహించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ సంస్థ కార్యదర్శి జె.వి.రత్నం, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు 'హరిత విశాఖ అందరి లక్ష్యం' అనే నినాదంతో కూడిన ప్లకార్డులతో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. డబ్ల్యూఎన్‌ఎస్ గ్లోబల్ సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, హెటిరో డ్రగ్స్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, దక్కన్ ఫైన్ కెమికల్స్, పేటీఎం, సువర్ణభూమి డెవలపర్స్, అపోలో ఫార్మసీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 375 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూలకు 314 మంది అభ్యర్థులు హాజరవగా.. 149 మంది ఎంపికైనట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారి సర్టిఫికెట్లను వారు పరిశీలించారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వారే నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని సుబ్బిరెడ్డి తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, ఎంప్లాయిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా-తిరుపతి(22889) ఎక్స్‌ప్రెస్ శనివారం రద్దు చేశారు. జూలైన 2న తిరుపతి-హౌరా(22890) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22808) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 4న ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ - సంత్రగచ్చి(22807) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

- విశాఖలో శుక్రవారం రాత్రి 9.05 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం- కోర్బా (18518) ఎక్స్‌ప్రెస్ రాత్రి 11.30 గంటలకు బయలుదేరింది.
- విశాఖలో శనివారం బయలుదేరాల్సిన విశాఖ-బెంగళూరు కంటోన్మెంట్ (08915) వన్‌వే స్పెషల్ 2 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్
- ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా భువనేశ్వర్‌లో జూలై 6న భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మిర్యాలగూడ, నల్గొండలో ప్రయోగాత్మక హాల్ట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

గౌహతి-సికింద్రాబాద్ మధ్య స్పెషల్

ప్రయాణికుల రద్దీ తగ్గించేందుకు గౌహతి-సికింద్రాబాద్ మధ్య సింగిల్ ట్రిప్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు అధికారులు చెప్పారు. గౌహతి-సికింద్రాబాద్(05614) స్పెషల్ జూలై 2న ఉదయం 6 గంటలకు గౌహతిలో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 5.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.35 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-గౌహతి(05613) స్పెషల్ సికింద్రాబాద్‌లో జూలై 9న మధ్యాహ్నం 11.45 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 12.50 గంటలకు విశాఖ చేరుకుంటుంది. మధ్య రాత్రి 1.10కి బయలుదేరి మంగళవారం ఉదయం 10.20 గంటలకు గౌహతి వెళ్తుంది.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 10 ఫిర్యాదులు

అల్లిపురం: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి పది ఫిర్యాదులు అందాయి. పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి సునీత ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో 2వ జోన్‌కు రెండు, 5వ జోన్‌కు 4, 6వ జోన్‌కు 1, 8వ జోన్‌కు 3.. మొత్తం 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజీవీఎంసీ పరిధిలోని ఎనిమిది జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించినా, భవన నిర్మాణ వ్యర్థాలు ఇష్టానుసారం డంప్ చేసినా జీవీఎంసీలో టోల్ ఫ్రీ నంబర్ 18004250009కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. వాట్సాప్ నంబర్ 8187897569కు పూర్తి వివరాలను పంపితే చర్యలు చేపతామని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను జయప్రదం చేద్దాం


సచివాలయ సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సేవలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పిలుపునిచ్చారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనలతో శుక్రవారం మధురానగర్‌లోని 130 సచివాలయంలో వార్డు సచివాలయ సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్లతో జగనన్న సురక్ష నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహించి ప్రభుత్వం ఉచితంగా అందించే 11 రకాల సేవలు, సర్టిఫికెట్ల వివరాలను తెలియజేయాలని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ప్రభుత్వ సేవలు, పథకాలు అందుకోకుండా ఉండిపోయారా గుర్తించి వారికి అవి అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


పాస్టర్ ప్రేమ్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న కె.కె.రాజు, వెంగళరావు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు జగ్జీవన్ నగర్ కొండవాలు ప్రాంతంలోని క్రీస్తు సంఘం చర్చికి మాజీ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కొల్లాబత్తుల వెంగళరావు ఆర్థిక సాయం అందజేశారు. తన జన్మదిన వేడుకల సందర్భంగా శుక్రవారం ఆయన నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా పాస్టర్ కె.ప్రేమ్‌కుమార్‌కు రూ.50 వేల చెక్కును అందించారు. ముందుగా కేక్ కట్‌చేసి పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరకులు, పండ్లు పంపిణీ చేశారు. స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని వెంగళరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంపా హనోకు, రెయ్యి వెంకటరమణ, కె.అనిల్‌కుమార్‌రాజు, కె.వి.ఎన్.శశికళ, చల్లా రజిని, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తానా పోటీల్లో అరుదైన గౌరవం

రచయిత చినసూర్యనారాయణ కవితకు బహుమతి



మురళీనగర్: ప్రముఖ రచయిత, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చినసూర్యనారాయణకు అరుదైన గౌరవం లభించింది. ఇటీవల తానా ప్రపంచ వేదిక ఆధ్వర్యంలో తానా-సిరివెన్నెల సాహితీ పురస్కారానికి నిర్వహించిన పద్య కావ్య రచన పోటీల్లో ఆయన రచించిన 'త్రిశతి' కావ్యాన్ని ఉత్తమ రచనగా ఎంపిక చేసింది. ఖులుసు వేంకటేశ్వర్లు ఈ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించగా.. ఎంపికైన పది ఉత్తమ రచనల్లో చినసూర్యనారాయణ రచనకు చోటు లభించింది. ఆయన చిన్న సూరి కలం పేరుతో రచనలు ప్రారంభించారు. ఇటీవల భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా రిటైర్ అయ్యారు. ఆయన కలం నుంచి జాలువారిన సంజీవని(కవితా సంపుటి), సూర్యోక్తులు(శతకము), తెలుగు తోటలో సాహితీ సౌరభాలు, గేయరామాయణం, కథాకౌముది-బలివాడ కాంతారావు రచనలు ముద్రించారు. ఐకమత్యం(బాలల నాటకం), సహస్ర కిరణములు ముద్రణ దశలో ఉన్నాయి. ఆర్యోక్తులు(సీసపద్యములు), కథా సంపుటి, సామాజిక త్రిశతి (పద్యకృతి), గీతావళి ముద్రణకు సిద్ధమవుతున్నాయి. చినసూర్యనారాయణ ఎన్నో అవార్డులు పొందారు. విశాఖపట్నం స్వాతి వాసంతి కల్చరల్ అకాడమీ, సంక్రాంతి కళా పురస్కారం, ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ, విశాఖపటణంలో ఉగాది కవితా పఠన సన్మానం వంటి 16 అవార్డులు ఆయన అందుకున్నారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం సహృదయ సాహితి ప్రధాన కార్యదర్శిగా, మాధవధార అమరావతి విశ్వసాహితీకి ప్రధాన కార్యదర్శిగా, గురజాడ ఫౌండేషన్(అమెరికా) విశాఖ శాఖ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

వాల్తేర్ డివిజన్‌లో భద్రతా తనిఖీలు



డీజిల్ లోకోషెడ్ వద్ద తనిఖీలు చేస్తున్న సేఫ్టీ ఆడిట్ బృందం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ సెంట్రల్ రైల్వే, హాజీపూర్‌కు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ శివకుమార్ ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక భద్రతా ఆడిట్ బృందం వాల్తేర్ డివిజన్, విశాఖపట్నం-రాయగడ సెక్షన్‌లోని పలు ప్రధాన స్టేషన్లలో శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. భద్రతా సంబంధిత అంశాలపై మల్టీ డిసిప్లీనరీ బృంద రైల్వే అధికారులు ఇతర డివిజన్, జోన్‌ల పరిధిలో అప్పుడప్పుడు ఇటువంటి తనిఖీలు చేస్తుంటారు. ఈ బృంద సభ్యులు విశాఖలోని ఓర్ ఎక్స్‌చేంజ్ యార్డ్, డీజిల్ లోకోషెడ్‌లతోపాటు సెక్షన్ పరిధిలో వంతెనలు, లెవెల్ క్రాసింగ్స్, మలుపులు, పాయింట్స్, క్రాసింగ్స్‌లతోపాటు రాయగడ స్టేషన్‌లోని రన్నింగ్ రూం, క్రూ లాబీ, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో చీఫ్ ట్రాక్ ఇంజినీర్ ముకేష్ కుమార్, చీఫ్ రోలింగ్ స్టాక్ ఇంజినీర్ రావిష్‌కుమార్, చీఫ్ సిగ్నల్ ఇంజినీర్ ఆర్.ఎల్.యాదవ్, చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజినీర్ ఆర్.పి.భర్తి, వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), మోనిష్ బ్రహ్మ, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ అధికారులు, బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.

లాడ్జిలో కంచరపాలెం యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్: స్థానిక లాడ్జిలో విశాఖ కంచరపాలేనికి చెందిన ఎ.వంశీ(20) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా.. గురువారం మధ్యాహ్నం లాడ్జిలో దిగిన ఆ యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. తండ్రి శివప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ఆటోలపై ఈ-చలానాలు రద్దు చేయండి


ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: ఆటోలపై ఉన్న పోలీస్ ఈ-చలానాలు రద్దు చేసి ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి కోరారు. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్ శ్రీనివాసనగర్ జంక్షన్‌లో శుక్రవారం ఆటో డ్రైవర్ల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై పోలీస్‌లు విధిస్తున్న ఈ-చలానాలతో ఆర్థిక భారానికి గురవుతున్నారని, వాటిని రద్దు చేయాలని, పెంచిన ఇంధన ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావికృష్ణ, ఆటో సంఘం నాయకులు కాండ్రేగుల రాము, కె.కోటి, జి.నారాయణరావు, గణేష్‌కుమార్, తాతాలు, వెంకట్, ఈశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

చైతన్యం లేని టీడీపీ రథయాత్ర


తాటిచెట్లపాలెం బహిరంగ సభలో జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

మర్రిపాలెం: భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రకు స్పందన కరువైంది. ఉత్తర నియోజకవర్గంలో శుక్రవారం టీడీపీ బస్సు యాత్ర ఆర్ అండ్ బీ జంక్షన్‌లోని హోటల్ మారియట్ వద్ద నుంచి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు మొదలు కావాల్సిన బస్సు యాత్ర కాస్త..11.30 గంటలకు ప్రారంభమైంది. ఆలస్యానికి తోడు ఎండ తీవ్రంగా ఉండటంతో అక్కడికి వచ్చిన ప్రజలు కొంత అసహనం వ్యక్తం చేశారు. ఉత్తర ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు గెలిచిన తరువాత గడిచిన నాలుగేళ్లలో ఒక్కసారిగా కూడా నియోజకవర్గంలో అడుగుపెట్టలేదని కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏది ఏమైనా భవిష్యత్తుకు నో గ్యారెంటీలా యాత్ర సాగింది.

బోసిపోయిన బహిరంగ సభ

తాటిచెట్లపాలెం: ఉత్తర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన బస్సు యాత్ర నీరసంగా కొనసాగింది. బహిరంగ సభ జనం లేక బోసిపోయింది. ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన చైతన్య రథయాత్ర పలు ప్రాంతాల్లో సెల్ఫీలతో సాగింది. తాటిచెట్లపాలెం రేమా బ్లెస్సింగ్ చర్చ్ ముందు ఏర్పాటు చేసిన ముగింపు సభకు పలుచగా ప్రజలు హాజరయ్యారు. ముఖ్య నాయకులు ప్రసంగించే సమయంలోనే అధిక శాతం కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఇక్కడ మాట్లాడిన వారంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేందుకే పరిమితమయ్యారు. ఆయా వార్డుల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొరియన్ భాషతో ఉపాధి అవకాశాలు

సీతమ్మధార: కొరియన్ భాష నేర్చుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, అలా కియా కంపెనీలో చాలా మంది ఉద్యోగాలు సంపాదించారని కొరియాలోని సాంగ్‌గోక్ యూనివర్సిటీ అంబాసిడర్ కిమ్ హంగ్ జాయ్ స్పష్టం చేశారు. ద్వారకానగర్‌లోని ఇన్నార్ భవనంలో జూలై 1 నుంచి కోర్సులు ప్రారంభం కానున్నాయని, మేయర్ గొలగాని హరివెంకటకుమారి శనివారం కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 10+2 పాలిటెక్నిక్, ఐటీఐ చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారు, టెక్నికల్ స్కిల్స్ కలిగిన ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రికల్ విభాగాల్లో నైపుణ్యం ఉన్న వారికి కొరియన్ భాషలో కనీస పరిజ్ఞానం ఉంటే నెలకు రూ.లక్ష వేతనం లభించే అవకాశాలున్నాయన్నారు. రెండు నెలల్లో కొరియా భాష నేర్చుకునేలా సర్టిఫికెట్ కోర్సు విశాఖలో ప్రారంభం కానుందని చెప్పారు. ఆసక్తి గల వారు 87902 79628 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో యాక్ సౌత్ కొరియన్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.